ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

5★

జిల్లా వార్తలు

బుధవారం 10 జనవరి 2024

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి 8లో..

బొగ్గు రవాణాకు లారీ యజమానులు సహకరించాలి 8లో..

- మిల్లర్ల నుంచి రావాల్సిన బియ్యం 2.30లక్షల టన్నులు
- నెలాఖరు వరకు గడువు పొడిగింపు..
- నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలకు మంత్రి ఆదేశాలు



సీఎంఆర్‌పై సర్కారు దృష్టి

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గత ఏడాది వానాకాలం, ఎండా కాలం సీజన్‌లో రైస్ మిల్లర్లకు సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యాన్ని మర ఆడించి బియ్యం ఇవ్వాల్సిన రైస్ మిల్లర్లు ఇవ్వకపోవడంతో వారిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈనెలాఖరు వరకు బియ్యం ఇవ్వని మిల్లర్లపై కొరడా ఝుళిపించాలని, ఎంతటి వారైనా సరే కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఇప్పటికే జిల్లా అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు కలెక్టర్, అదనపు కలెక్టర్, పౌరసరఫరాల శాఖాధికారులు మిల్లర్లపై ఒత్తిడి పెంచుతున్నారు. రెండు సీజన్లకు కలిపి మిల్లర్ల నుంచి ఇంకా ప్రభుత్వానికి 2,30,074 టన్నుల బియ్యం రావాల్సి ఉన్నాయి. డిసెంబర్ నెలాఖరు వరకు పూర్తి చేయాలని ఆదేశించినప్పటికీ మిల్లర్లు టార్గెట్ పూర్తి చేయలేదు. గత ఏడాది వానాకాలంలో రైతుల నుంచి ప్రభుత్వం 2,99,757 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ఈ ధాన్యాన్ని మర ఆడించి 2,00,837 టన్నుల బియ్యాన్ని మిల్లర్లు ఎఫ్‌సీఐకి, పౌరసరఫరాల శాఖకు ఇవ్వాల్సి ఉంది. కానీ ఈనెల 8వ తేదీ నాటికి 1,44,824 టన్నులే ఇచ్చారు. ఇంకా 56,013 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. యాసంగి సీజన్‌లో రైతుల నుంచి 3,51,924 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. వీటిని మర ఆడించి 2,39,308 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు కేవలం 64,841 టన్నుల బియ్యం మాత్రమే సీఎంఆర్ కింద ఇచ్చారు. రెండు సీజన్లకు కలిపి 4,40,146 టన్నులకు గాను 2,10.072 టన్నుల బియ్యం మాత్రమే ఇచ్చారు. ఇంకా 2,30,074 టన్నుల బియ్యం సీఎంఆర్ కింద ఇవ్వాల్సి ఉంది. వాస్తవానికి ఒక సీజన్‌లో ఇచ్చిన ధాన్యాన్ని మరో సీజన్ వచ్చేలోపు ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ మూడేళ్ల నుంచి రైస్ మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు గానీ, గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడంతో మిల్లర్లు ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని తమ అవసరాలకు వినియోగించుకున్నారు.

● మిల్లర్లపై అధికారుల ఒత్తిడి..

గత ఏడాది వానాకాలం సీజన్‌లో కేంద్రాలకు సన్న ధాన్యం ఎక్కువగా వచ్చింది. తర్వాత ఆ ధాన్యానికి మంచి డిమాండ్ పెరగంతో మిల్లర్లు ఆ ధాన్యాన్ని బయట విక్రియించుకుని సొమ్ము చేసుకున్నారు. దొడ్డు ధాన్యాన్ని కూడా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు తరలించి విక్రయించారని సమాచారం. పౌరసరఫరాల శాఖ అధికారులు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీల్లో ప్రభుత్వం మిల్లర్లకు ఇచ్చిన ధాన్యం మిల్లుల్లో లేవని తేలినా కూడా చర్యలు తీసుకున్న సందర్భాలు లేవు. సకాలంలో సీఎంఆర్ పూర్తి చేయకపోయినా, ప్రభుత్వ ధాన్యాన్ని బయట విక్రయించినా కూడా వారిపై చర్యలు తీసుకోలేదు. గత ప్రభుత్వం, అధికార యంత్రాంగం రైస్‌మిల్లర్లపై పెద్దగా ఒత్తిడి పెంచి చర్యలు తీసుకోకపోవడంతో ధాన్యాన్ని బయట మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకున్నారు. వాస్తవానికి ఎఫ్‌సీఐ సెప్టెంబర్ 30వ తేదీ నాటికే గడువు విధించింది. నవంబర్ 30న జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత నుంచి ప్రభుత్వం మిల్లర్లకు ఇచ్చిన ధాన్యం గురించి ఆరా తీశారు. ఎఫ్‌సీఐకి పెట్టాల్సిన బియ్యం ఎన్ని, ఎన్ని పెట్టారు, ఇవ్వాల్సినవి ఎన్ని టన్నులు అనే విషయమై లెక్కలు తీశారు. మొదట డిసెంబర్ నెలాఖరు వరకు టార్గెట్ పూర్తిచేయాలని ఆదేశించారు. అయినా టార్గెట్ పూర్తికాకపోవడంతో ఎట్టి పరిస్థితుల్లోనూ ఈనెలాఖరు వరకు వందకు వంద శాతం సీఎంఆర్ పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. లేనట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులను తనిఖీ చేసి సీఎంఆర్ పెంచే విధంగా చర్యలు తీసుకోవాని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు అధికారులు మిల్లర్లపై ఒత్తిడి పెంచుతున్నారు. తక్కువ మొత్తంలో బియ్యం ఇచ్చిన మిల్లర్లు జిల్లాలో 17మంది ఉన్నారని అధికారులు గుర్తించారు. వారి నుంచి బియ్యం రాకుంటే క్రిమినల్ కేసులైనా పెట్టాలని అధికారులు భావిస్తున్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

ముత్తారం, జనవరి 9: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తులను వెంటవెంటనే ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు గ్యారెంటీ పథకాలతో ప్రజల నుంచి దరఖాస్తుల ఆహ్వానం పూర్తి అయిందని వాటిని మండల స్థాయి అధికారులు వెంటవెంటనే ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేసి పూర్తిచేయాలని ఆమె అన్నారు. జిల్లాలో ముత్తారం మండల అధికారుల పనితీరు నెమ్మదిగా ఉందని, పనిలో వేగవంతం చేయని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆన్‌లైన్ చేయడానికి సిబ్బంది సరిపోకపోతే ఇతర మండలాల నుంచి సిబ్బందిని తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం లక్కారం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీచేసి శిథిలావస్థకు చేరుకున్న గదులను, పాఠశాల ఆవరణలో సౌకర్యాలను పరిశీలించారు. అడవిశ్రీరాంపూర్ చౌరస్తాలో ఉన్న చేతిపంపు ఆక్రమణకు గురైనట్లు వార్డు సభ్యులు చేసిన ఫిర్యాదుకు ఆమె స్పందించి వెంటనే వినియోగంలోకి తీసుకువచ్చి వారికి వాట్సాప్ ద్వారా ఫొటో పంపించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ ఎంపీవో వేణుమాధవ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు కార్యాలయాల్లో విజిలెన్స్ తనిఖీలు

జ్యోతినగర్, జనవరి 9 : కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ కార్యాలయాల్లో మంగళవారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో ఉన్న ఈఎన్‌సీ కార్యాలయం, భీమునిపట్నంలోని సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయం, ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డులోని క్వాలిటీ కంట్రోల్ కార్యాలయాల్లోని కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన డాక్యుమెంట్లను అధికారులు పరిశీలించారు. అవసరమైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి డీ మాధవి

పెద్దపల్లి కల్చరల్, జనవరి 9 : తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతిలో అడ్మిషన్ పొందుటకు, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్నటువంటి సీట్లలో ప్రవేశాలకు ఫిబ్రవరి 22లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆదర్శ పాఠశాలలలో అడ్మిషన్స్ పొందుటకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్న వారికి ఏప్రిల్ 7న అడ్మిషన్ టెస్ట్ నిర్వహించేందుకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ఎక్స్‌అఫిషియో ప్రాజెక్టుడైరెక్టర్, ఆదర్శ పాఠశాలలు షెడ్యూల్ విడుదల చేశారని అన్నారు. 6వ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 7న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 7న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓసీ విద్యార్థులకు 200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగుల, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు 125 రూపాయలు అడ్మిషన్ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం ఆదర్శ పాఠశాలల వెబ్‌సైట్ http://telanganams.cgg.gov.inను సందర్శించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- మార్చి 3న ప్రవేశ పరీక్ష నిర్వహణ

పెద్దపల్లి కల్చరల్, జనవరి 9 : బీసీ గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఫిబ్రవరి 15లోపు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ప్రాంతీయ సమన్వయ అధికారి ఎం. గౌతమ్ కుమార్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 30 మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలు(15 బాలల, 15 బాలికల) ఉన్నాయని, 6,7,8వ తరగతి(ఇంగ్లిష్ మీడియం)లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి మార్చి 3న ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఖాళీలను బట్టి ప్రవేశ పరీక్షలో రిజర్వేషన్, మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారని, ఆసక్తి, అర్హతలుగల బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులు ఫిబ్రవరి 15లోగా ఆన్‌లైన్‌లో 100 రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలపేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి, పూర్తివివరాలతో కూడిన సమాచారపత్రం కోసం www.mjptbcwreis.telangana.gov.in లేదా www.mjptbcwreis.cgg.gov.in వెబ్‌సైట్‌లలో సంప్రదించాలని ప్రాంతీయ సమన్వయ అధికారి ఎం. గౌతమ్ కుమార్ రెడ్డి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సమ్మక్క-సారలమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జాతర నిర్వహణ - సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ

పెద్దపల్లి కల్చరల్, జనవరి 9 : జిల్లాలో నిర్వహించే సమ్మక్క సారలమ్మల జాతరకు ప్రణాళికాబద్ధంగా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలో నిర్వహించే సమక్క సారలమ్మ జాతర ఏర్పాట్లపై సింగరేణి కాలరీస్, ఎన్టీపీసీ, రామగుండం కార్పొరేషన్, రెవెన్యూ, సమక్క-సారలమ్మ బోర్డు మెంబర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ మాట్లాడుతూ ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు నిర్వహించే సమక్క సారలమ్మ జాతర జిల్లాలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టంగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళిక రూపొందించుకోవాలని అన్నారు.జాతర నిర్వహించే ప్రదేశాన్ని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి భక్తులకు ఇబ్బందులు కలగకుండా కార్యాచరణ వివిధ డిపార్ట్మెంట్ల వారీగా తయారు చేయాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించాలని అదనపు పారిశుధ్య వర్కర్లను నియమించాలని అదనపు కలెక్టర్ సూచించారు. జాతర నిర్వహణకు సంబంధించి అవసరమైన నిధుల ప్రతిపాదనలు తయారు చేసి సమర్పించాలని, జిల్లాలో ఉన్న సింగరేణి, ఎన్టీపీసీ వారిచే నిధులు అలాట్ చేసే విధంగా సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు. జాతర నిర్వహణకు సంబంధించి క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో మరో సమావేశం నిర్వహించాలని, జాతర సమయంలో తప్పనిసరిగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించే యంత్రాంగం తయారు చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి శ్రీసమక్క-సారలమ్మల జాతరను నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఫిబ్రవరి 21 నుంచి ఫిబ్రవరి 24 వరకు మూడు ప్రాంతాలలో జాతర నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయించిందని, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకునే ఈ జాతరను విజయవంతంగా నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సన్నద్ధం కావాలని అన్నారు. జాతరకు విచ్చేసే భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాతర గ్రౌండ్ శుభ్రం చేయడం, జాతర గ్రౌండ్ లెవల్ చేయుట, నాగరాజు రోడ్డు నిర్మాణం, ఐరన్ బారికేడ్లు, హుండీల తయారీ, జాతర గ్రౌండ్‌లో విద్యుత్ సరఫరా అలంకరణ, మట్టితో ముంపు ప్రదేశం మొత్తం చదును చేయడం వంటి ఏర్పాట్లను సింగరేణి కాలరీస్ సిద్ధం చేయాలని తెలిపారు. సమక్క సారలమ్మల గద్దెలు మరమ్మతుచేయటం, నిర్మించటం, ప్రహరీగోడకు రంగులు వేయటం, మొక్కుబడి, ఒడి బియ్యం భక్తులు వేయుటకు డ్రమ్ముల ఏర్పాటు ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చూసుకోవాలని తెలిపారు. జాతర సందర్భంగా సింగరేణిలో రామగుండం నగరపాలక సంస్థ జాతర జరిగే చోట పారిశుధ్యం పాటించడం, గ్రౌండ్ శుభ్రపర్చాలని, తాగునీరు ఏర్పాట్లు, తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించాలని, శుభ్రపర్చడానికి వ్యక్తులను నియమించాలని, ప్రతిరోజు చెత్తను శుభ్రపర్చుట, జాతర రోడ్డు నుంచి గోదావరి నీరు ఉన్న ప్రాంతం వరకు తాత్కలిక రోడ్డు నిర్మించాలని, స్నానాలు ఆచరించడానికి షవర్స్ ఏర్పాటు చేయాలని, మహిళలు దుస్తులు మార్చుకోవడానికి గదులు ఏర్పాటు, విద్యుత్ దీపాలంకరణ సాయంత్రం నుంచి ఉదయం వరకు నిరంతరాయంగా సాగేటట్లుగా చూడాలని, విద్యుత్ అంతరాయం కలగకుండా జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని, గోదావరి నదీ ప్రాంతంలో సేఫ్టీ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. జాతర జరిగే నాలుగు రోజులు వైద్య సిబ్బంది, 108 వాహనం, మందులు అందుబాటులో ఉంచాలని, ఫైర్‌ఇంజన్ 24గంటల పాటు షిఫ్ట్ డ్యూటీలలో అందుబాటులో ఉంచాలని తెలిపారు. జాతర జరుగు ప్రాంతాలలో ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ ఇబ్బంది కల్గకుండా చూడాలని,అవసరమైన చోట సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ పోలీసు శాఖ వారిని ఆదేశించారు. పుణ్యస్నానాలు చేసే వద్ద గజఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ శాఖల సిబ్బందికి భోజన ఏర్పాటు, జాతర ప్రారంభానికి వి.ఐ.పి.ల ఆహ్వానం, పబ్లిక్ అడ్రెస్ సిస్టం ఏర్పాటు, నిర్వహణ వంటి పనులు దేవాదాయ శాఖ వారు నిర్వహించాలని, గోదావరిఖని ఆర్టిసి డిపో మేనేజరు జాతర జరుగు ప్రాంతాలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సులు నడపాలని, జాతర పరిసరాల ప్రాంతాలలోని అనుమతి లేని మద్యం దుకాణాలు మూసివేయాలని, పోలీసు భద్రత ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ తెలిపారు. జాతర నిర్వహణ అంశంలో ప్రతి ఒక్క శాఖ తమకు కేటాయించిన విధులను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

ఈ సమావేశంలో రామగుండం కార్పొరేషన్ మేయర్ అనిల్ కుమార్, ఏసీపీ తులా శ్రీనివాస్‌రావు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఏ. చంద్రశేఖర్, ఎక్సైజ్ శాఖ అధికారి మహిపాల్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్ నాగభూషణం, తహసీల్దారులు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలను తేలికగా తీసుకోవద్దు

- అన్ని నియోజకవర్గాల్లోనూ మెజార్టీ సాధించాలి - ప్రతి అసెంబ్లీ నియోజకర్గ అభివృద్ధికి పదేసి కోట్లు

- ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో భేటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఉమ్మడి జిల్లా నేతలు

కరీంనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ఎవరూ తేలికగా తీసుకోవద్దని, గెలుపే లక్ష్యంగా ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల పరిధిలో మెజార్టీ తీసుకురావడానికి కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్‌డీలో ముఖ్యమంత్రి మంగళవారం కరీంనగర్, ఖమ్మం, నల్గొండ ఉమ్మడి జిల్లాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాల వారీగా చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో ముఖ్యమంత్రి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పది పార్లమెంట్ స్థానాలను గెల్చుకోవడం లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతున్నదని, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు తమ తమ నియోజకవర్గాల పరిధిలో పార్టీ అభ్యర్థులకు అత్యధిక మెజార్టీని సాధించేందుకు కృషి చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించవలసిన వ్యూహంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతలకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు నియోజకవర్గ అభివృద్ధి పథకం కింద ఒక్కో నియోజకవర్గానికి 10 కోట్ల రూపాయలు కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రజల అవసరాలను గుర్తించి ఎమ్మెల్యేలు పనులను ప్రతిపాదించాలని, పార్టీ ఎమ్మెల్యేలు లేనిచోట నియోజకవర్గాల ఇన్‌చార్జిలు జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ప్రతిపాదనలు అందజేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అభివృద్ధి విషయంలో ఎలాంటి అలసత్వాన్ని, అవినీతిని ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి హెచ్చరించారని సమాచారం. ప్రజలకు సేవలందించడంలో ఎమ్మెల్యేలు ముందుండాలని, ప్రజల్లోనే ఉంటూ వారి మన్ననలు పొందాలని సూచించారు. తాను కూడా వారంలో మూడు రోజులు ఎమ్మెల్యేలను, ప్రజాప్రతినిధులను కలుస్తూ వారి నుంచి సమస్యలు తెలుసుకుంటానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

నెలాఖరు నుంచి జిల్లాల వారీగా పర్యటనలు

ఈనెల చివరి వారం నుంచి జిల్లాలవారీగా పర్యటనలు చేపడతానని ఈ సమావేశంలో ముఖ్యమంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శాసనమండలి సభ్యుడు టి జీవన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, విజయరమణారావు, కరీంనగర్, హుజూరాబాద్, కోరుట్ల, సిరిసిల్ల నియోజకవర్గాల ఇన్‌చార్జిలు శ్రీనివాస్, ప్రణవ్‌బాబు, జువ్వాడి నర్సింగరావు, కేకే మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఇతర కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్న కారణంగా మంత్రి శ్రీధర్‌బాబు ఈ సమావేశానికి హాజరుకాలేదని సమాచారం. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కలిసి నెల రోజుల పరిపాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. తమ నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వినతి పత్రాలను ముఖ్యమంత్రికి అందజేశారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

- అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ లాల్

పెద్దపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం చేయాలని, అదే సమయంలో సమాంతరంగా మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అత్యంత కఠినంగా మాదక ద్రవ్యాలు సరఫరా చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిందని, మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. నేటి యువత భావిభారత పౌరులని, వీరిలో కొంతమంది డ్రగ్స్‌కు ఆకర్షితులైతే దేశ భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. దీనిని గుర్తించి డ్రగ్స్‌వల్ల కలిగే విపరీత పరిణామాలపై అవగాహన పెంచుకొని దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌తో పాటు, గుట్కా, గంజాయి, మాదక ద్రవ్యాలు, సిగరెట్ మొదలగు చెడు అలవాట్లకు సైతం దూరంగా ఉండాలన్నారు. చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బ తింటుందని, ఆలోచనా విధానం, ఆలోచనా శక్తి నశిస్తాయన్నారు. భావితరాలు మాదకద్రవ్యాలపై ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియజేయాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సెలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. జిల్లాలో గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ విస్తరణ అధికారులతో తనిఖీ చేయించాలన్నారు. మారుమూల గ్రామాలు, బార్డర్ గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గంజాయి మొక్కలు కనిపిస్తే పోలీసు, ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. అటవీ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని ఆసుపత్రులు, మెడికల్ షాపులు డ్రగ్స్ ఎలా వాడుతున్నారో గమనించాలని, ప్రతి ఆసుపత్రి డ్రగ్ స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని అదనపు కలెక్టర్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. జిల్లాలోకి మాదక ద్రవ్యాలు, గంజాయి రవాణా కాకుండా చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఉన్న విద్యా సంస్థల్లో విద్యార్థుల అలవాట్లను పరిశీలించాలని, మాదక ద్రవ్యాల వాడకం వల్ల వచ్చే నష్టాలను వివరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఏసీపీ తులా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూనే సమాంతరంగా వాటి నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. భవిష్యత్తులో అతిపెద్ద సవాలు మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు ఉంటాయని, వీటిని నియంత్రించేందుకు ప్రజలు సహకారం అందించాలని ఆయన పేర్కొన్నారు. నేటి యువతపై తల్లిదండ్రులు నిరంతర పర్యవేక్షణ ఉంచాలని, తప్పుడు దారులలో వెళ్లకుండా జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంథని రెవెన్యూ డివిజన్ అధికారి హనుమా నాయక్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్తీక్ భరద్వాజ్, ఎక్సైజ్ శాఖ అధికారి మహిపాల్‌రెడ్డి, వ్యవసాయ, విద్యా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా బట్టీలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 9: మండలంలోని పెగడపల్లి, తారుపల్లి, పందిళ్ల గ్రామాల్లో గుడుంబా బట్టీలపై ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పట్టుబడిన 350 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, గుడుంబా నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. గుడుంబా బట్టీల దాడుల్లో ఎక్సైజ్ సీఐలు శ్యాముల్, ఆనందరావు, రామ్‌రెడ్డి, విజయ్‌కుమార్, రాథోడ్, ఎస్ఐలు శిరీష, సాయిబాబా, వెంకటేశ్వర్‌రావు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

భగత్‌నగర్, జనవరి9: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 1,195 అదనపు బస్సులు నడిపిస్తున్నట్లు కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం బుధవారం నుంచి 22వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నామన్నారు. జూబ్లీబస్‌స్టేషన్ నుంచి కరీంనగర్‌కు, తిరుగు ప్రయాణంలో కరీంనగర్ నుంచి జూబ్లీ బస్‌స్టేషన్‌కు అదనపు బస్సులు నడిపించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అదనపు బస్సులకు ఎలాంటి అదనపు చార్జీలు లేవని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందస్తు రిజర్వేషన్ కోసం ఆర్టీసీ వెబ్‌సైట్‌ను చూడాలని ఆర్ఎం సూచించారు.

ఎస్‌యూ డిగ్రీ పరీక్షల్లో 17 మంది డీబార్

గణేశ్‌నగర్, జనవరి 9: శాతవాహన విశ్వవిద్యాలయం డిగ్రీ ఒకటో, మూడో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం 17 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. సెమిస్టర్-1లో వాగేశ్వరి డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో-3, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అగ్రహారంలో -4, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎస్‌కేఎన్‌ఆర్ జగిత్యాల లో-3, శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో-3, మూడో సెమిస్టర్‌లో ఎస్‌కె ఎన్‌ఆర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల జగిత్యాలలో-1, వాగేశ్వరి డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ముగ్గురు డీబార్ అయినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, జనవరి 9: నగరంలోని ఓ భవనంలో పీవోపీ పనులు చేస్తున్న కార్మికుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడని కరీంనగర్ రెండో టాణా పోలీసులు తెలిపారు. హుస్సేనిపుర ప్రాంతానికి చెందిన మహ్మద్ ఫరీద్‌ఖాన్(47) సాయినగర్‌లోని రాజాథియేటర్ ఎదుట ఒక భవనంలో పీఓపీ పనులు చేస్తున్న సమయంలో రెండో అంతస్తులోని విద్యుత్ వైర్‌ను మొదటి అంతస్తు నుంచి లాగుతున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా ఫరీద్‌ఖాన్ మృతి చెందాడు. మృతుడి కొడుకు లక్కీ ఖాన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చోరీపై విచారణ

కరీంనగర్ క్రైం, జనవరి9: కరీంనగర్‌లోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలోని రికార్డు గదిలో ఇటీవల గుర్తుతెలియని వ్యక్తి చొరబడి కొన్ని డాక్యుమెంట్లు చోరీ చేసినట్లు అనుమానిస్తున్న ఘటనపై మంగళవారం పోలీసులు విచారణ జరిపారు. సబ్ రిజిస్ట్రార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన ఒకటో టాణా పోలీసులు ఇప్పటికే కార్యాలయ ఉద్యోగుల వేలి ముద్రలను సేకరించగా కొందరు ఉద్యోగుల నుంచి సమాచారం సేకరించారు.

ఇటుకబట్టీలో బాలకార్మికుడు : కేసు నమోదు

సిరిసిల్ల క్రైం, జనవరి 9: సిరిసిల్ల పట్టణంలోని రగుడు సమీపంలో గల అయ్యప్ప మణికంఠ స్వామి ఇటుక బట్టీ యజమాని జనగామ రాజేశ్వర్ రావుపై మంగళవారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సిఐ ఉపేందర్ తెలిపారు. ఇటుకబట్టీల వద్ద వ్యాన్‌లో ఇటుకలను ఒరిస్సా ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలుడు లోడు చేస్తుండగా ఆపరేషన్ స్మైల్ రెస్క్యూ బృందం గుర్తించి బాలల సంరక్షణ సమితి ఎదుట హాజరుపరిచింది. ఈ మేరకు బాలకార్మికుడితో పనిచేయించిన యజమానిపై డిసిపియు ఉద్యోగి సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని ఆయన తెలిపారు. ఓ జిన్నింగ్ మిల్లులోనూ బాలకార్మికుడు పనిచేస్తుండగా రెస్క్యూ బృందం గుర్తించి బాలల సంరక్షణ సమితికి అప్పగించారు.

ఆర్టీసీ బస్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

చందుర్తి, జనవరి 9: చందుర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ బస్టాండ్ వద్ద ఓ వృద్ధుడిని మంగళవారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నక్క యోసెఫ్ అనే వృద్ధుడు బస్టాండ్‌లో నడుచుకుంటూ వెళ్తుండగా వేములవాడ నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వృద్ధుడికి గాయాలయ్యాయి. గాయపడిన వృద్ధుడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడలోని ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి ఎస్సై అశోక్ చేరుకొని విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి తీవ్రగాయాలు

గంభీరావుపేట, జనవరి 9 : గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామ సమీపాన మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన దోమ్మాట నాగరాజు, ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన కాసారపు కాశయ్యలు ద్విచక్ర వాహనంపై గంభీరావుపేట మండలం గోరంటాలలోని బంధువుల వద్దకు వచ్చి, తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. సముద్రలింగాపూర్ వద్ద వీరి ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో కాశయ్య తలకు, నాగరాజు కాలుకు తీవ్ర గాయాలయ్యాయి.

వీరిద్దరిని 108 అంబులెన్స్‌లో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తీసుకెళుతుండగా, మార్గ మధ్యలో కాశయ్య మృతి చెందాడు. నాగరాజుకు కాలు విరిగి చికిత్స పొందుతున్నాడు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ మహేష్ పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాడు. .

నేడు వీరభద్రస్వామి కల్యాణం

● హాజరుకానున్న మంత్రులు పొన్నం, కొండా సురేఖ



శ్రీవీరభద్రస్వామి

భీమదేవరపల్లి, జనవరి 9 : కొత్తకొండ వీరభద్రస్వామి కల్యాణం బుధవారం కన్నుల పండువగా జరగనుంది. స్వామి వారి కల్యాణానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలు హాజరు కానున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. స్వామివారి కోనేరు పక్కన గల కల్యాణ మండపంలో స్వామివారి కల్యాణాన్ని అర్చకులు నిర్వహించనున్నారు. ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలు అందజేయనున్నారు. స్వామి వారి కల్యాణానికి చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయంతో పాటు కల్యాణం జరిగే మండపం వద్ద విద్యుదీకరణ పూర్తి చేశారు. కల్యాణానికి కొత్తకొండతో పాటు ముస్తాఫాపూర్, గట్లనర్సింగాపూర్, ఎర్రబెల్లి, మల్లారం, ముల్కనూర్, భీమదేవరపల్లి గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించనున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు జ్యోతి, కృష్ణవేణి, కృష్ణప్రసాద్ తదితరులకు కల్యాణ ఆహ్వాన పత్రికలు అందజేశామని, వారు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

అదుపు తప్పి ఆయిల్ ట్యాంకర్ బోల్తా

● ఎగిసిపడిన మంటలు.. పేలిన ట్రాన్స్‌ఫార్మర్ ● తప్పిన ప్రాణాపాయం

మెట్‌పల్లి, జనవరి, 9: మెట్‌పల్లి పట్టణ శివారులోని జాతీయ రహదారిపై వెళుతున్న ఆయిల్ ట్యాంకర్ మంగళవారం వేకువజామున టైర్ పేలి అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ట్యాంకర్ నుంచి భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. మంటల ధాటికి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో మంటలు మరింత ఎక్కువయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది ఆరు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ నుంచి మల్లాపూర్ మండలంలోని రాఘవుపేట గ్రామానికి ఆయిల్ ట్యాంకర్ బయలు దేరింది. వేకువజామున పట్టణ శివారులోని మూలమలుపు వద్దకు రాగానే ట్యాంకర్ టైర్ పేలి బోల్తా పడింది. వెంటనే డ్రైవర్ ట్యాంకర్ నుంచి దూకి ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ట్యాంకర్‌కు ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. స్థానికులు గమినించి వెంటనే అగ్నిమాపక, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. మంటలు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు అంటుకోవడంతో అది పేలి మరింత ఎక్కువయ్యాయి. దీంతో సమీపంలో ఉన్న గు రుకుల పాఠశాల, పెట్రోల్ బంక్‌కు మంటలు అంటుకుని పెద్ద ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అగ్ని మాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్లతో శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంతో నిజామాబాద్, జగిత్యాల జిల్లాకు ప్రధాన రహదారి కావడంతో



బోల్తాపడి మంటలు అంటుకున్న ఆయిల్ ట్యాంకర్

సుమారు రెండు కిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఎస్సై చిరంజీవి కోరుట్ల, మల్లాపూర్ ఎస్సైల సహకారంతో వాహనాలను ఇబ్రహీంపట్నంలోని పలు గ్రామాల మీదుగా దారి మళ్లించారు. ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో మెట్‌పల్లి పట్టణంతో పాటు చుట్టు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సంఘటన స్థలాన్ని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పరిశీలించారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ, డీఎఫ్‌వో మురళీ మనోహర్, ఏఎఫ్‌వో భానుప్రసాద్ సిబ్బంది ఉన్నారు.

కాకతీయ కాలువకు నీటి విడుదల పెంపు

జగిత్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువ ద్వారా సరఫరా చేస్తున్న నీటి విడుదలను మంగళవారం అధికారులు పెంచారు. ఇప్పటి వరకు మూడు వేల క్యూసెక్కుల నీటిని కాలువకు విడుదల చేస్తున్నారు. కొద్ది కొద్దిగా ఆరు వేల క్యూసెక్కులకు పెంపు చేస్తున్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు సామర్థ్యం 90.3 టీఎంసీలు కాగా ప్రస్తుతం డ్యామ్‌లో 66.526 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 8,162 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 6 వేల క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 250 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 502 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కులు, వరద కాలువకు 2 వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథ పథకాలకు 152 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత యేడాది జూన్ ఒకటవ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 200.682 టీఎంసీల నీరు రాగా, 155.049 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు. యాసంగి పంట నీడి విడుదల ప్రణాళిక ప్రకారం ఈనెల 9వ తేదీ ఉదయం 8 గంటల నుంచి కాకతీయ కెనాల్ (ఎల్ఎండీ పైన) జోన్ -2 పరిధిలోని ఆయకట్టు వినియోగం కోసం 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామని ఎస్సారెస్పీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు మానకొండూర్‌కు మంత్రి పొన్నం

మానకొండూర్, జనవరి 9 : రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం మానకొండూర్ మండలంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్యాలండర్ ఆవిష్కరణ, నిజాయితీగూడెంలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం గంగిపల్లిలో జరిగే పలు అభివృద్ది కార్యక్రమాలకు భూమిపూజ, ప్రారంభోత్సవాల కార్యక్రమంలో పాల్గొంటారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

చొప్పదండి, జనవరి 9: నవోదయ విద్యాయలంలో 2024-25 విద్యాసంవత్సరానికి 6వ తరగతి ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ మంగతా యారు ఒక ప్రకటనలో తెలి పారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు 7,105 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరూ ఆన్‌లైన్‌లో తమ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, హాల్ టికెట్ డౌన్‌లో డ్‌లో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే హెల్ప్‌లైన్ నెంబర్లలో సంప్రదించాలని పేర్కొ న్నారు. దరఖాస్తులో కులం, కేటగిరీ, అర్బన్, రూరల్, పుట్టిన తేదీ, జెండర్ నమోదులో తప్పిదాలు జరిగినట్లయితే అన్ని ఆధారాలతో ఈ నెల 16వ తేదీలోగా తమ విద్యాలయంలో సంప్రదించాలని, నవోదయలో సీటు ఇప్పిస్తామంటూ వచ్చే దళారుల మాట నమ్మి మోసపోవద్దని ఆమె తెలిపారు.

పెద్దమ్మ ఆలయంలో కుంకుమ పూజలు

మెట్‌పల్లి, జనవరి 9: మెట్‌పల్లి పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు ఘనంగా చేపట్టారు. మార్గశిర ధనుర్మాసం మంగళవారం సందర్భంగా పెద్దమ్మ ఆలయంలో సామూహిక సత్యనా రాయణ స్వామి, శ్రీ కాత్యాయని దేవి వ్రతాలు, కుంకుమ పూజలు ఆలయ పురోహితుడు మదన్‌శర్మ అంగరంగ వైభవంగా జరిపించారు. ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం జరిపి లోక కళ్యాణార్థం ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవమూర్తులతో భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి అయలంలో ఏర్పాటు చేయగా సామూహిక వ్రతాలు, కుంకుమ పూజలను భక్తులచే జరిపించారు.

నియోజక వర్గంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దత్తత్రేయుని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపి, శ్రీఐశ్వర్యలక్ష్మి గోశాలలోని ఆవులకు ఆహారం అందజేశారు.

రేపు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జూనియర్ బాలికల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 9: ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామడుగు జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో ఈ నెల 11న ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్స్ బాలికల ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణులను ఈ నెల 15 నుంచి 17 వరకు ఆసిఫాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారిణులు ఉదయం 10 గంటలకు సంయుక్త కార్యదర్శి ఎన్ ప్రభాకర్, హ్యాండ్‌బాల్ కోచ్ మూల వెంకటేశ్‌కు రిపోర్టు చేయాలని సూచించారు.

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు

మల్యాల, జనవరి 9: కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని మొ క్కులు తీర్చుకున్నారు. బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో బుద్ది శ్రీనివాస్ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కొండగట్టులో భక్తుల రద్దీ



బద్దిపోచమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

బద్దిపోచమ్మకు భక్తుల మొక్కులు

వేములవాడ టౌన్, జనవరి 9: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయ అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం తెల్లవారు జామునే అమ్మవారికి నైవేద్యం వండి బోనాలతో శివత్తుల నృత్యాలతో డప్పుచప్పుల్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరకున్నారు. నెత్తిన బోనాలతో భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి ఆలయంలోకి ప్రవేశించారు. అమ్మవారికి ఒడిబియ్యం పోసి నైవేద్యం సమర్పించారు. కళ్లసాకతో పాడి, పంట, పిల్లాపాపలు చల్లంగా ఉండాలని అమ్మవారిని వేడుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సూపరింటెంట్ హరిహరనాథ్ పర్యవేక్షించారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తుల అరెస్టు

ఇల్లందకుంట, జనవరి 9: అమాయక ప్రజలను బెదిరింపులకు గురిచేస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జమ్మికుంట రూరల్ సీఐ కొరె కిశోర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం ఇల్లందకుంట మండలంలోని పాతర్లపల్లి గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి, మొగుళ్లపల్లి మండలంలోని గుండ్లకర్తి గ్రామానికి చెందిన రియాజ్, కుమారస్వామి, సురేష్‌లు స్నేహితులు. వీరు ఒక ముఠాగా ఏర్పడి అమాయక ప్రజలను బెదిరిస్తూ డబ్బులు, ఇవ్వాలని వేదిస్తుండేవారని చెప్పారు. వారి వేధింపులు భరించలేక బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, మరో వ్యక్తి సురేష్ పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు. ఎవరైనా అమాయక ప్రజలను బెదిరింపులకు గురిచేస్తే కేసులు తప్పవని సీఐ కిశోర్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ రాజకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

కొండగట్టులో పార్కింగ్ ఇబ్బందులు

మల్యాల, జనవరి 9: కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చే భక్తుల వాహనాలకు సరైన పార్కింగ్ లేక తీవ్ర అసౌకర్యానికి గురి అవుతున్నారు. మంగళవారం వందలాది వాహనాల్లో వేలాదిగా భక్తులు తరలిరాగా కొండపైన, వైజంక్షన్ వద్ద ట్రాఫిక్ జాం ఏర్పడింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వై జంక్షన్ వద్ద వాహనాలు ఒకదాని వెనుక మరొకటి చిక్కుకొని ముందుకు వెళ్లడానికి నానా కష్టాలు పడ్డారు. పార్కింగ్, ట్రాఫిక్ జాంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

పొలం పనులు చేస్తుండగా విద్యుదాఘాతంతో మహిళ మృతి



మధుప్రియ(ఫైల్)

తంగళ్లపల్లి, జనవరి 9: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం తాడురులో మంగళవారం పొలం పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మల్లెబోయిన మధుప్రియ (28) అనే మహిళా రైతు మృతి చెందింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడూరు గ్రామానికి చెందిన రాకేశ్- మధుప్రియ దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం పొలంలో మధుప్రియతోపాటు మరో ఆరుగురు వరినాట్లు వేస్తున్నారు. ఈ క్రమంలో కర్ర సహాయంతో ఏర్పాటు చేసిన బోరు మోటార్‌కు వెళ్లే విద్యుత్ వైరు జారి పొలంలో పడింది. అక్కడే వరినాటు వేస్తున్న మధుప్రియ వైర్‌ను తొలగించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త రాకేశ్, కుమారుడు రిషిత్(8), రిషిత (6) ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మిడ్‌మానేరులో భూమి కోల్పోయి పేదరికం అనుభవిస్తున్న కుటుంబంలో ఇల్లాలు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ సర్పంచ్ గుర్రం రాజలింగంగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.

ఘనంగా అన్నకూటోత్సవం

కోరుట్ల, జనవరి 9 : పట్టణంలోని అతిపురాతనమైన వెంకటేశ్వర ఆలయంలో మంగళవారం అన్న కూటోత్సవ (తిరుప్పావడ సేవ) వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు బీర్నంది నరిసింహాచారి మత్రోచ్ఛరణ మధ్య ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస గద్య, విష్ణు సహస్రపారాయణం నిర్వహించి తిరుప్పావై సేవ కార్యక్రమాలను వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చన అభిషేక కార్యక్రమాలను జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కూటోత్సవ కోసం తయారు చేసిన పులిహోరను భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈవో విక్రం, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య, ఆండాళ్ గోష్టి బృంద సభ్యులు పాల్గొన్నారు.



వైవేద్యంతో ప్రత్యేక అలంకరణ

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

సుల్తానాబాద్, జనవరి 9: సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శాస్త్రినగర్‌కు చెందిన పోలోజు నాగరాజు(38) చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ విజేందర్ తెలిపారు. నాగరాజు స్థానిక రైస్ మిల్లులో ఆపరేటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడని, కొద్దిరోజులుగా పనిమానేసి ఖాళీగా ఉంటున్నాడని ఎస్ఐ వివరించారు. కొన్ని సందర్భాలలో వెల్డింగ్ పనులకు రోజువారి కూలీగా వెళుతున్నాడని పనిచేసిన తర్వాత వచ్చిన డబ్బులతో మద్యం తాగుతూ కుటుంబాన్ని పోషించడం లేదన్నారు. సోమవారం సాయంత్రం ఇంటినుంచి బయటకు వెళ్లిన నాగరాజు శాస్త్రినగర్ వద్ద గల టీఎన్‌జీవోల భవనం ఎదురుగా ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్ఐ తెలిపారు. మంగళవారం ఉదయం గ్రామస్థులు గుర్తించారని, భార్య వనజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అప్పుల బాధ భరించలేక మరొకరు..

పెద్దపల్లి రూరల్, జనవరి 9 : మండలంలోని పెద్దకల్వల గ్రామానికి చెందిన భూషణవేని శ్రీనివాస్(38) అప్పుల బాధ భరించలేక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పుల బాధ భరించలేక సోమవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుని భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ మహేందర్ తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

సుల్తానాబాద్, జనవరి 9: గంజాయిని రవాణా చేస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని గర్రెపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి గంజాయిని రవాణా చేస్తున్నాడని అందిన సమాచారం మేరకు తాము మాటువేసి పట్టుకున్నామని, అతన్ని విచారించగా బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుక్కలగూడురు గ్రామానికి చెందిన నలిమెల వినోద్‌గా తేలిందని టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. అతని వద్ద కిలో 750 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామన్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ ప్రాంతంలోని యువత, విద్యార్థులకు ఎక్కువ ధరలకు విక్రయించడానికి రవాణా చేస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ 35వేల రూపాయలు ఉంటుందన్నారు.

సరైన పత్రాలు, నంబర్ ప్లేటు లేని వాహనాలపై చర్యలు

- సుల్తానాబాద్ సీఐ జగదీష్



పొత్కపల్లిలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఓదెల, జనవరి 9 : ఓదెల మండలం పొత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వాహనాల తనిఖీ స్పెషల్ డ్రైవ్‌ను సుల్తానాబాద్ సీఐ జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఓదెల మండలంలోని ప్రధాన కూడళ్లలో వాహనాలను తనిఖీలు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఇన్సూరెన్స్‌లు, నంబర్ ప్లేట్‌లు లేనివారిపై కేసులు నమోదు చేశారు. నంబర్ ప్లేట్ లేని 45 వాహనాలకు ఈ చలాన్స్, 7 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో ఎస్ఐలు శ్రీధర్, శ్రీనివాస్, కళాధర్‌లు పాల్గొన్నారు.

'పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి సారించండి'

ఓదెల, జనవరి 9 : రానున్న పార్లమెంట్, స్థానిక ఎన్నికలపై దృష్టి పెట్టాలని ఎంపీ బండి సంజయ్ కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లో బీజేపీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రే సంజీవరెడ్డి,కార్యకర్తలు ఎంపీ బండి సంజయ్‌ని కలిశారు. అనంతరం నాయకులతో మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ రాకముందే ఇప్పటినుంచి నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకం కావాలని కోరినట్లు ఇక్కడి బీజేపీ నాయకులు తెలిపారు. బండి సంజయ్‌ని కలిసిన వారిలో కర్రె సంజీవరెడ్డితో పాటు బీజేపీ యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కొంగరి అనిల్ కుమార్ యాదవ్, తాజొద్దిన్ ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

పెద్దపల్లి రూరల్ , జనవరి 9 : మండలంలోని చీకురాయిలో మంగళవారం కేంద్ర ప్రభుత్వం పథకాలపై అవగాహన కల్పించారు. వికాసత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్రచార రథం ద్వారా ఎల్‌ఈడీస్క్రీన్‌పై కేంద్రం అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు చూపించారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు


ఉపాధ్యాయులతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఎలిగేడు, జనవరి 9 : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని శివపల్లిలోని ఆయన నివాసంలో మంగళవారం ఎస్టీయూ ఉపాధ్యాయ క్యాలండర్, డైరీని ఆయన ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 77ఏళ్లుగా ఉపాధ్యాయులకు, విద్యారంగానికి సముచిత సేవలు అందిస్తున్న ఎస్టియు క్యాలెండర్ ఆవిష్కరణ గావించడం సంతోషకరమన్నారు. విద్యారంగానికి సముచిత న్యాయం అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం సేవలు మరువలేనివన్నారు. సంఘ నాయకులు తన దృష్టికి తీసుకువచ్చిన అన్ని విషయాలు సీఎం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. సీపీఎస్ రద్దు త్వరలోనే జరిగేలా చూస్తామని అన్నారు. పాఠశాలలో సౌకర్యాల కల్పన, స్పెషల్ వర్కర్ ఏర్పాటు విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంటానని, పాఠశాలల సమస్యల పరిష్కారం విషయంలో ఎల్లప్పుడూ ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటానన్నారు. జిల్లా అధ్యక్షుడు మేరుగు సతీష్ మాట్లాడుతూ కోర్టు కేసుల కారణంగా మధ్యలో ఆగిపోయిన బదిలీలు, పదోన్నతులు వెంటనే పరిష్కరించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మందల శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నడిపెల్లి సతోష్‌కుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి జి.మధుసూదనాచారి, రాష్ట్ర కమిటీ సభ్యులు తోట రాజు, గంధ్ర దేవేందర్‌రావు, నల్ల రాజేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కేతిపల్లి మహేందర్‌రెడ్డి, ఫయజుద్దీన్, మోతె సమ్మయ్య, గంధం రాజేందర్, పుప్పాల సత్యనారాయణ, సుంకె నర్సింగం, వడ్లూరి రమేష్, చిలగాని శ్రీనివాస్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కస్నూరి ఆనందరావు, కేతిపల్లి ప్రభాకర్‌రెడ్డి, గుండా మల్లికార్జున్, అప్పాల అంజయ్య, ముల్కల రాజశేఖర్, చకిలం శ్రీధర్, దాతు సదానందం, వడ్లూరి శ్యామ్‌కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య శ్రీరాముడి అక్షింతలు పంపిణీ

కళ్యాణ్‌నగర్, జనవరి 9: అయోధ్య శ్రీరాముడి జన్మభూమి నుంచి తీసుకువచ్చిన అక్షింతలను హనుమాన్‌నగర్, వినోభానగర్, కేసీఆర్ కాలనీలోని దేవాలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు, వీహెచ్‌పీ, గోరక్షక్ జిల్లా కన్వీనర్ మద్దెల శ్రీనివాస్ మాట్లాడారు. హిందు ధర్మాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని అన్నారు. విశ్వహిందు పరిషత్, బజరంగ్‌దళ్ ఉద్యమంతో 30 సంవత్సరాలుగా హిందు సమాజాన్ని చైతన్యం చేయడం జరుగుతుందని అన్నారు. రామజన్మభూమి ఉద్యమంలో లక్షల మంది కరసేవకులకు ప్రాణాలు అర్పించారని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. హిందు సంస్కృతి, సంప్రదాయాలను చిన్నప్పటి నుంచి అలవాటుచేయాలని, జనవరి 22న శ్రీరామజయ జయరామ మహామంత్రాన్ని పటిస్తూ దీపావళి పండుగలా జరుపుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి అయోధ్య రవీందర్, నగర కార్యదర్శి మేడగోని రవీందర్, బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ ముష్కె సంపత్, నేరేడుకొమ్మ వెంకటస్వామి, అడిగొప్పుల రాజు, కొండపర్తి లింగన్న, శశికుమార్, బొమ్మక రాజేష్, యశ్వంత్, రమేష్, గొటిక శ్రీనివాస్ పాల్గొన్నారు.


అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షింతలతో భక్తులు

మంథని, జనవరి 9: స్థానిక శ్రీలక్ష్మినారాయణ స్వామి ఆలయం నుంచి స్థానిక శ్రీరామకాలనీ భక్తులు అయోధ్య శ్రీసీతారాముల అక్షింతలను మంగళవారం శోభయాత్రతో తరలితీసుకువెళ్లారు. అయోధ్య రామతీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొద్దిరోజులుగా స్వామివారి అక్షింతలను కాలనీలో భక్తుల ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు కొత్త శ్రీనివాస్, గర్రెపల్లి వెంకన్న, కనుకుంట్ల స్వామి సుదర్శన్, బొద్దు సతీష్, నరేందర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఓదెల, జనవరి 9: మండలంలోని హరిపురంలో మంగళవారం అయోధ్య రాములవారి వద్ద పూజలు నిర్వహించిన అక్షింతలను గ్రామస్థులకు పంపిణీ చేశారు. ముందుగా స్థానిక హనుమాన్ ఆలయంలో ఉంచిన అక్షింతలను రామభక్తులు తీసుకువచ్చి గడపగడపకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుండేటి మధు,అమ్ముల బిక్షపతి యాదవ్, గ్యారవేణి మహేందర్, బొంకూరి రాజు, గుండెటి మహేందర్, వార్డు సభ్యులు గంధం పద్మ, ఈద శ్రీనివాస్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ టెన్నికాయిట్, టగ్ ఆఫ్ వార్ జిల్లా జట్ల ఎంపిక


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌జీఎఫ్ కార్యదర్శి

కరీంనగర్ స్పోర్ట్స్ జనవరి 9: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ టెన్నికాయిట్, టగ్ ఆఫ్ వార్ జట్ల ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సప్తగిరికాలనీలో నిర్వహించిన టెన్నికాయిట్ పోటీలకు జిల్లాలోని 175 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అలాగే మానకొండూర్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెంజర్లలో నిర్వహించిన టగ్ ఆఫ్ వార్ పోటీలకు 175 మంది క్రీడాకారులు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరై ప్రతిభచాటారు. అలాగే పోటీల నిర్వహణకు 50 మంది వ్యాయామ ఉపాధ్యాయులు హాజరై పోటీలను నిర్వహించారు. ఉదయం ఈ పోటీలను జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్ క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పూదరి రమేశ్, శ్రీనివాస్, విష్ణు, అంతటి శంకరయ్య, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

'మత్స్యకారుల సంక్షేమానికి కృషి'

సుభాష్‌నగర్, జనవరి9: రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమానికి మత్స్యరంగ సమగ్ర అభివృద్ధికి తెలంగాణ ఫిషరీస్ సొసైటీ కృషి చేస్తుందని, తాము ఆ దిశలో కొనసాగించే కార్యాచరణలో రాష్ట్రంలోని మత్స్యకారులందరిని భాగస్వాములను చేస్తామని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ముఖ్య నాయకుల ప్రత్యేక సమావేశంలో ఆయన జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించారు. తెలంగాణ ఫిషరీస్ సొసైటీ జిల్లా అధ్యక్షునిగా మాల కనకయ్య, ప్రధాన కార్యదర్శిగా పెసరు కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా ఏరవేణి రామాంజనేయులు, కూనచ్చుల మహేందర్, భూమా సంపత్, కార్యదర్శులుగా పప్పు సమ్మయ్య, గొల్ల శ్రీనివాస్, బినమేని చంద్రమౌళి, గుండ్ల వెంకట్, ఘనవేని మల్లేశంలను ప్రకటించారు. మత్స్యరంగ అభివృద్ధికి, మత్స్యకార కుటుంబాల సంక్షేమానికి సొసైటీ కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు.

అంతర్జాతీయ వైజ్ఞానిక ఉత్సవాలకు వెనీల ఎంపిక



రామగిరి, జనవరి 9: హర్యానా రాష్ట్రంలో ఈనెల 16న నిర్వహించే అంతర్జాతీయ వైజ్ఞానిక ఉత్సవాలకు మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన సైయిండ్ల వెనీల ఎంపికయ్యారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో వైజ్ఞానిక సైన్స్ లిట్రసీ అనే అంశంపై ప్రసంగించే అవకాశం వెనీలకు లభించింది. మేడ్చల్ జిల్లా సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న వెనీలను గ్రామస్థులు అభినందించారు.

అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి

అంతర్గాం, జనవరి 9: అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని అంతర్గాం తహసీల్దార్ రామ్‌మోహన్‌రావు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 22వరకు అర్హులైన వారు ఫారం నెం.6 ద్వారా ఓటరుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. మరణించిన వారిని తొలగించుటకు ఫారం నెం.7ద్వారా, ఇతర సవరణలకు ఫారం నెం.8 ద్వారా చేయించుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో గిర్దావర్‌లు రాజేందర్‌రెడ్డి, శ్రీధర్, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

కరాటేలో విశ్వభారతి విద్యార్థుల ప్రతిభ



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

జ్యోతినగర్, జనవరి 9 : ఇటీవల పరకాలలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో స్థానిక విశ్వభారతి పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. ఎం.హర్షిత్, ఎన్.గౌతమ్, కె.విష్ణువర్ధన్‌లకు బంగారు పతకాలు లభించాయి. పతకాలు సాధించిన విద్యార్థులు, కోచ్ మొండయ్యను విశ్వభారతి విద్యా సంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్, హెచ్‌ఎం తిరుపతి గౌడ్, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్‌లు సన్మానించారు.

'ప్రభుత్వ విప్‌పై బీఆర్‌ఎస్ నాయకుల ఆరోపణలు అవాస్తవం'

ధర్మారం, జనవరి9: ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలు అవాస్తవమని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖండించారు. మంగళవారం ధర్మారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పత్తిపాక గ్రామ కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. పత్తిపాక, నర్సింగాపూర్ గ్రామ శివారులో గల ప్రభుత్వ భూముల విషయంలో బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలు అర్థరహితమన్నారు. ఈసమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఏదుల్లా అంజయ్య, కాంపెల్లి పోచయ్య, మెట్‌పల్లి నరేష్, బొంకూరి అశోక్, నెరవట్ల మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు ఇవ్వాలి

మంథని, జనవరి 9: స్వచ్ఛ సర్వేక్షణ్-2023 కింద ఎంపికైన తమ గ్రామ పంచాయతీకి కేంద్ర ప్రభుత్వం అవార్డును ప్రదానం చేసి తన చిత్తశుద్ధిని చాటుకోవాలని మంథని మండలంలోని నాగారం గ్రామానికి చెందిన సర్పంచ్ బూడిద మల్లేష్ మంగళవారం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో ఎంపికైన గ్రామపంచాయతీలకు అక్టోబరు 2న మహాత్మాగాంధీ జయంతి పురస్కరించుకొని రాష్ట్రపతి లేదా దేశ ప్రధాని చేతుల మీదుగా ప్రదానం చేయాల్సిన అవార్డును ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా తమ గ్రామపంచాయతీకి అవార్డును ఇవ్వాలని కోరారు.

'ఆర్టీసీ కార్మికుల్లో ఉత్సాహం నింపడానికి వన భోజనాలు'


ఆటల పోటీల్లో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులు

కళ్యాణ్‌నగర్, జనవరి 9: ఆర్‌టీసీ కార్మికుల్లో నూతన ఉత్తేజాన్ని నింపేందుకు వన భోజన కార్యక్రమానికి ఏర్పాటు చేసినట్లు గోదావరిఖని డిపో మేనేజర్ ఎం నాగభూషణం తెలిపారు. మంగళవారం గోదావరిఖని ఆర్‌టీసీ డిపోలో డ్రైవర్లకు, కండక్టర్లకు క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు అధిక సంఖ్యలో ఆదరించడం వల్ల ఆక్యుపెన్సీ రేషియా 90శాతం చేరుకుందని, చాలా మంది ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, వారిలో ఉత్సాహం నింపేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రతి డిపోలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. మహిళ కండక్టర్లకు, డ్రైవర్లకు వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాంపెల్లిదాస్

రామగిరి, జనవరి 9: కమాన్‌పూర్, ముత్తారం మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాంపెల్లిదాస్, ప్రధాన కార్యదర్శిగా జాన్‌పాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మండల కేంద్రంలో కమాన్‌పూర్, ముత్తారం, రామగిరి మండలాల పాస్టర్ల సమావేశాన్ని నిర్వహించి నూతనంగా అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

ధర్మారం, జనవరి9: మండల కేంద్రంలోని సాధన జూనియర్ కళాశాలలో మంగళవారం సైబర్ నేరాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలను వాడితే వచ్చే నష్టాలు, దుష్ప్రబావాల గురించి ఎస్సై సత్యనారాయణ వివరించారు. చదువుపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించి మంచి ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు. ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో పోలీసులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ


ధర్మారంలో వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

ధర్మారం, జనవరి 9: మండల కేంద్రంలో మిషన్ భగీరథ నీటి సరఫరా పైపులు లీకేజీ అవుతున్నాయి. అధికారులు నామమాత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి పాత బస్టాండ్ సమీపంలో గల రాష్ట్ర రహదారి పక్కన నిర్మాణం చేసిన పైపులు లీకై నీరంతా రోడ్డుపై ప్రవహించింది. సంబంధిత అధికారులకు తెలియజేసినా స్పందన లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు, సంబంధిత శాఖల అధికార యంత్రాంగం పైపులు లీకేజీ కాకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఓసీపీ-2ని సందర్శించిన డిప్యూటీ డైరెక్టర్ జనరల్


ప్రాజెక్టును పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అజయ్‌సింగ్

రామగిరి, జనవరి 9: సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2 ప్రాజెక్టును మంగళవారం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్‌సేఫ్టీ(ఎలక్ట్రికల్) అజయ్ సింగ్ సందర్శించారు. ప్రాజెక్టు ఉత్పత్తి, రవాణా, భవిష్యత్ ప్రణాళికలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో ఎలక్ట్రికల్ పరమైన భద్రతపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య, ఇన్‌చార్జి జీఎం రాధాకృష్ణ, ఏజీఎంలు ఎలీషా, సీతారామం, ప్రాజెక్టు అధికారి రాజేందర్, ఏరియా సేఫ్టీ అధికారి వెంకటరమణ, రామారావు, నాగరాజులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన జీఎం


మంత్రి శ్రీధర్‌బాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జీఎం

రామగిరి, జనవరి 9: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మంగళవారం ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, ఏరియా సెక్యూరిటీ అధికారి లక్ష్మీనారాయణ, ఎస్టేట్స్ అధికారి ఐలయ్య, డిప్యూటీ మేనేజర్ కోల శ్రీనివాస్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఓసీపీ-2 విస్తరణకు సంబంధించిన భూసేకరణ, అక్కేపల్లి, బిట్టుపల్లి ఆర్‌అండ్‌ఆర్ కేంద్రానికి సంబంధించిన వివరాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలపై మంత్రి సానూకులంగా స్పందించినట్లు అధికారులు వెల్లడించారు.

బొగ్గు రవాణాకు లారీ యజమానులు సహకరించాలి

గోదావరిఖని, జనవరి 9: దేశవ్యాప్తంగా నూతన భారతీయ న్యాయసంహిత 2023 చట్టాన్ని అమలుచేయడం లేదని, అయినా సింగరేణిలోని కొన్ని ఏరియాల్లో పనిచేసే లారీ యజమానులు బొగ్గు రవాణాను చేయకుండా నిరసనలు జరుపుతున్నట్లు దృషికి వచ్చిందని సింగరేణి యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ విధంగా నిరసనలతో బొగ్గు రవాణాకు ఆటంకం ఏర్పడుతుందని, లారీల యజమానులు బొగ్గు రవాణాను యధావిధిగా చేస్తూ సహకరించాలని కోరింది. ఇటీవల భారతీయ న్యాయ సంహిత 2023ను అమలులోకి వచ్చిందని, ఈ చట్టంలోని సెక్షన్ 106(2) ప్రకారం ఎవరైనా మోటార్ వాహన డైవరు నిర్లక్ష్యంగా వాహనం నడుతూ ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగి, దానిలో ఎవరైనా మృతిచెందితే, అట్టి ప్రమాద వివరాలు సమీప పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని, లేకపోతే వారికి రూ.10సంవత్సరాల జైలుశిక్ష, రూ.7లక్షల జరిమానా అమలు చేయనున్నట్లు పేర్కొంటుందన్నారు. ఈ నూతన విధానాన్ని నిరసిస్తూ ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్టు కాంగ్రెస్ ప్రతినిధులు సమ్మెకు పిలునిచ్చిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ అసోసియేషన్ ప్రతినిధులతో కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ భల్లా ఈనెల 2వ తేదిన చర్చలు జరిపి నూతన విధానాన్ని ప్రస్తుతానికి అమలులోకి తేవడం లేదని తెలిపారని, దీనిపై చర్చలు జరిగిన తరువాతే అమలు చేయడం జరుగుతుందని హామీఇచ్చారన్నారు. దీంతో దేశవ్యాప్తంగా తలపెట్టిన ట్రక్‌లు, లారీల యజమానులు సమ్మె విరమించుకున్నారని, కాబట్టి బొగ్గు రవాణాను యధావిధిగా చేస్తూ సహకరించాలని కోరింది.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఆర్‌జీ-1 జీఎం


సింగరేణి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జీఎం శ్రీనివాస్, అధికారులు

గోదావరిఖని, జనవరి 9: నూతన సంవత్సర సింగరేణి క్యాలెండర్‌ను మంగళవారం ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ ఆవిష్కరించారు. స్థానిక ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ సాధించిన అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ పచ్చదనం, ఉద్యోగుల సంక్షేమం, సింగరేణిలో ఉన్నటువంటి అత్యాధునిక యంత్రాల ఫొటోలతో రూపొందించిన ఈ క్యాలెండర్ ద్వారా సంస్థ సాధిస్తున్న అభివృద్ధికి ప్రతి ఒక్కరికి తెలిసేలా ఉందన్నారు. ఆర్‌జీ-1 పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులందరికి క్యాలెండర్ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం రాంమోహన్, ఏజీఎం (పర్సనల్) లక్ష్మీనారాయణ, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, అధికారులు ఆంజనేయప్రసాద్, ఆంజనేయులు, శ్రీధర్, మదన్‌మోహన్, బాల సుబ్రహ్మణ్యం, నాగేశ్వర్, సీనియర్ పీఓ శ్రావణ్ కుమార్, ఏఐటీయూసీ ప్రతినిధి రాజు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేతలకు అభినందన

శ్రీరాంపూర్, జనవరి 9: సింగరేణిస్థాయి అధికారుల క్రికెట్ పోటీల్లో సీనియర్, జూనియర్ విభాగాలలో బెల్లంపల్లి రీజియన్ జట్టు విజయం సాధించడంపై శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అభినందించారు. కొత్తగూడెంలోని రుద్రంపూర్‌లో ఈ నెల 7న జరిగిన పోటీల్లో బెల్లంపల్లి రీజియన్ జట్టు విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలో శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన అబ్దుల్ ఖాదిర్(సీనియర్ జట్టు కెప్టెన్), డాక్టర్ లోక్‌నాథ్ రెడ్డి(జూనియర్ జట్టు కెప్టెన్), క్రీడాకారులు డాక్టర్ పి. రమేష్‌బాబు, కె వెంకటేశ్వర్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, శ్రీధర్, రాజేం దర్, ఎ కిరణ్‌కుమార్‌లను అభినందించారు. సింగరేణి కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకొని క్రీడల్లో రాణించాలని ఆయన సూచించారు.

వైద్య సౌకర్యాలు కల్పించాలి

శ్రీరాంపూర్, జనవరి 9 : రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఏరియా ఆస్పత్రిలో వైద్య సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె. బాజీసైదా డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఏరియా ఆస్పత్రిని సందర్శించి వైద్య సదుపాయాలను పరిశీలించారు. వైద్య సదుపాయాలపై కార్మికులు అసంతృప్తితో ఉన్నారని, ఏదైనా ప్రమాదం జరిగితే మెరుగైన వైద్య అందే అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పించి కార్మికులు, వారి కుటుంబాలకు వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి వైద్యం అందించాలని కోరారు. ఆయన వెంట ఆర్‌కె 5 పిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగారావు, కాంట్రాక్టు కార్మిక సంఘం బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు రమణ, దేవేందర్ పాల్గొన్నారు.

'కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి'

శ్రీరాంపూర్, జనవరి 9 : సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని సింగరేణి కాంట్రా క్టు కార్మిక సంఘం(ఎస్‌సీకేఎస్-సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. మధు కోరారు. సింగరేణిలోని 11 ఏరియాలకు చెందిన కాంట్రాక్టు కార్మికులతో కలిసి మంగళవారం హైదరా బాద్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. పలువురు మాట్లాడుతూ, గతంలో ఉన్న రాష్ట్ర ప్ర భుత్వం కనీస వేతన జీవోలను విడుదల చేసినా కొనేళ్లుగా గెజిట్ చేయకుండా కాలయాపన చేసందన్నారు. దీంతో జీతాలు పెరుగలేదని చెప్పారు. ప్రభుత్వం స్పందించి జీవోలను గెజిట్ చేసి వేతనాలు పెంచాలని కోరారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

జైపూర్, జనవరి 9: జైపూర్‌లోని ఎస్టీపీపీలో సింగరేణి నూతన సంవత్సరం క్యాలెండర్లను మంగళవారం ఈడీ బిసివిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీపీపీకి నిర్ధేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ మేరకు దేశంలోనే అత్యుత్తమ ప్లాంటుగా నిలబెట్టి సంస్థ అభివృ ద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ప్రసాద్, రమణ, రామా శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.